తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:70

24 క్యారెట్లు 145,800.00 | కిలో వెండి 2,05,000.00 | chourastha Digitals | 10.11.2026 మంగళవారం, హైదరాబాద్

తెలంగాణలో చివరిదశకు ఎస్ఐఆర్ ప్రక్రియ

- 70 లక్షల ఓట్లు తగ్గే అవకాశం..
- 2.61 కోట్ల ఓట్లకు ఆమోదం
- మరో 25 వేల నోటీసుల విచారణ మాత్రమే పెండింగ్
- ఈ నెల 30న తుది ఓటరు జాబితా



2లో



కేసీఆర్ అప్పుల భారం మోస్తున్నాం

ఆయన చేసిన అప్పులకు మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు చెల్లించాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులకు రాష్ట్ర ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు చెల్లించిందని వెల్లడించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి గత ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

పదేళ్ల పాలనలో రూ.20 లక్షల కోట్ల పన్నుల ఆదాయం

ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం

కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులు

పాలమూరు ప్రజల ఆశలను కేసీఆర్ వమ్ము చేశారు


మక్తల్-నారాయణపేట ప్రాజెక్టును పక్కన పెట్టారు

కొడంగల్ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నా

లగచర్ల సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

రూ.9,050 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడోరోజు పర్యటన కొనసాగించిన సీఎం.. పాలమూరు జిల్లా ప్రజల ఆశలను కేసీఆర్ వమ్ము చేశారని మండిపడ్డారు. పాలమూరు నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్ జిల్లా రుణం తీర్చుకుంటారని ఆశించామని, కానీ పాలమూరు

।మిగతా 2 లో।

దేశద్రోహులెవరో చర్చకు సిద్ధమా..?

- ప్రధానికి రాహుల్ గాంధీ సవాల్
- ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం..
- మోదీ ధైర్యం ఉంటే ముందుకు రావాలి
- దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలతో రాజకీయంగా వేడెక్కిన వాతావరణం
- విపక్షాలపై మోదీ విమర్శలకు రాహుల్ ఘాటు కౌంటర్



ప్రధాని నరేంద్ర మోదీ తనపై, ప్రతిపక్షాలపై చేసిన దేశద్రోహ ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ ఆరోపణలపై తనతో బహిరంగ చర్చకు రావాలని మోదీకి మరోసారి సవాల్ విసిరారు. దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నది ఎవరు? అనే అంశాలపై ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. గతంలో తాను విసిరిన సవాల్ ఇప్పటికీ అలాగే ఉందని పేర్కొన్నారు.

2లో

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో

రంగారెడ్డి కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- రూ.2 వేల జరిమానా విధింపు..
- అప్పీలుకు నాలుగు వారాల గడువు



2లో

అగ్రికల్చర్ వర్సిటీ వీసీపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- ప్రొఫెసర్ జానయ్యకు మహిళా కమిషన్ నోటీసులు
- ఈ నెల 12న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- బాధితురాలికి న్యాయం చేయాలంటూ వర్సిటీలో ఉద్యోగ సంఘాల ఆందోళన



2లో



కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి కలకలం

- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ
- ఛార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.5 లక్షల డిమాండ్.
- చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం
- గతంలోనూ ఇదే స్టేషన్ అధికారులపై లంచం ఆరోపణలు.ఎం
- వరుస ఏసీబీ కేసులతో పోలీసు శాఖలో చర్చ

3లో

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగుచూసింది. కేసు ఛార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరించడంతో పాటు త్వరగా దాఖలు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా నాగారంలోని శిల్పానగర్ కాలనీలో ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయాన్ని హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ వెల్లడించారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో

రైతు సమస్యలే అజెండా..

- రైతు గర్జన సభలతో రాజకీయ పోరాటానికి బీఆర్ఎస్ పదును
- మూడు జిల్లాల్లో రైతు గర్జన సభలు
- సాగునీరు, పంట నష్టాలపై ప్రభుత్వాన్ని నిలదీసే యోచన
- రైతు కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సాయం




2లో



2లో

వాయు కాలుష్యంతో 20 లక్షల మంది మృతి

- 2023లో మొత్తం మరణాల్లో 22 శాతం కాలుష్యం కారణంగానే..
- మోదీ సర్కార్ నిర్లక్ష్యంపై కాంగ్రెస్ నేతల విమర్శలు



దీపావళి వేళ అగ్నిప్రమాదాల కలకలం

- హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ మంటలు
- టపాసుల నిప్పురవ్వలతో పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు..
- లక్షలాది రూపాయల ఆస్తి నష్టం

2లో

తెలంగాణలో చివరిదశకు ఎస్ఐఆర్ ప్రక్రియ

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :



తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటివరకు 2,61,74,795 మంది ఓటర్ల పేర్లకు తుది జాబితా కోసం ఆమోదం లభించింది. మరో 25 వేల నోటీసులపై విచారణ మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఓట్లు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 30న తుది ఓటరు జాబితాను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించిన ఎన్యుమరేషన్ ప్రక్రియలో 2,64,73,616 మంది మాత్రమే స్పందించారు. దీంతో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారి పేర్లను తొలగించి ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య సుమారు 2.70 కోట్లకు పరిమితం కానున్నట్లు తెలుస్తోంది.ఎన్యుమరేషన్ దశలోనే రాష్ట్రవ్యాప్తంగా 73,39,235 ఓట్లు తగ్గాయి. వీరిలో 9,22,229 మంది మరణించినట్లు గుర్తించారు. మరో 45,18,963 మంది చిరునామాలు మార్చుకోగా, 11,25,546 మంది అందుబాటులో లేరని అధికారులు గుర్తించారు. అదేవిధంగా 6,70,203 మంది ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని వారు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న మొత్తం 92,88,181 మందికి ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో సుమారు 91.10 లక్షల మంది అవసరమైన పత్రాలు సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకున్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలోనే సుమారు 40 లక్షల మంది ఓటర్లు తమ పేర్లను జాబితాలో కొనసాగించుకునేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. మరోవైపు నోటీసులు అందుకున్న వారిలో సుమారు 54 వేల మందిని అనర్హులుగా గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని అధికారులు నిర్ణయించారు. వీరిలో ఎక్కువమందికి ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటు ఉన్నట్లు గుర్తించారు.ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 26 వరకు నోటీసులు, అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల పరిష్కారానికి గడువు విధించింది. ఈ నెల 30న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. అయితే తుది జాబితా వెలువడిన తర్వాత కూడా అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సీఈవో కార్యాలయం స్పష్టం చేసింది.దీంతో ఓటు హక్కు కోల్పోయిన అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు సూచిస్తున్నారు.

కేసీఆర్ అప్పుల భారం మోస్తున్నాం



తరువాయి భాగం

ప్రజలను పట్టించుకోకుండా గజ్వేల్‌కు వెళ్లిపోయారని విమర్శించారు. మక్తల్-నారాయణపేట ప్రాజెక్టును గత ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు.

అప్పుల భారం మోస్తున్నాం

పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు పన్నుల రూపంలో రూ.20 లక్షల కోట్లు చెల్లించారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి 1 నుంచి ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని, సంక్షేమ పథకాల నిధులను పదో తేదీలోపు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రతి నెలా 20వ తేదీలోపు బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి రూ.80 వేల కోట్ల చెల్లింపుల భారం మోస్తున్నామని, ఇప్పటివరకు మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు చెల్లించామని వెల్లడించారు.

పాలమూరు అభివృద్ధిని అడ్డుకోవద్దు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు వలసలు ఆగలేదని సీఎం అన్నారు. కొడంగల్ ప్రాంతంలో వ్యవసాయానికి సరైన నీటి వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుంటామని కొందరు చెబుతున్నారని, అభివృద్ధి పనులు చేపడుతుంటే ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని తెలిపారు.

కేటీఆర్‌పై విమర్శలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేటీఆర్‌కు గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి రావడానికి ఎన్నేళ్లు పడుతుందోనని ఎద్దేవా చేశారు. గడ్డం పెంచినా, పది జన్మలు ఎత్తినా రేవంత్‌రెడ్డి కాలేరని వ్యాఖ్యానించారు. అందుకు గుండె ధైర్యం, నమ్మినవారి కోసం నిలబడే త్యాగగుణం ఉండాలని అన్నారు.

రూ.9,050 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

కొడంగల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దుద్యాల మండలం పోలేపల్లికి చేరుకుని ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్రగా లగచర్ల బహిరంగ సభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రూ.9,050 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎకోపామ్ ఆయిల్ ఫ్యాక్టరీ, నాచారం గ్రామం నుంచి కొత్వాల్‌గూడ వరకు రేడియల్ రోడ్2 నిర్మాణం సహా పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.

దేశద్రోహులెవరో చర్చకు సిద్ధమా..?

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :



ప్రధాని నరేంద్ర మోదీ తనపై, ప్రతిపక్షాలపై చేసిన దేశద్రోహ ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ ఆరోపణలపై తనతో బహిరంగ చర్చకు రావాలని మోదీకి మరోసారి సవాల్ విసిరారు. దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నది ఎవరు? అనే అంశాలపై ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.గతంలో తాను విసిరిన సవాల్ ఇప్పటికీ అలాగే ఉందని పేర్కొన్నారుబస్తర్‌లో దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.మోదీ చేసిన వ్యాఖ్యలను అక్కడున్న భద్రతా సిబ్బంది నమ్మలేదని, వారి ముఖ కవళికలే అందుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందించారు. తనతో బహిరంగ చర్చ జరిగితే ఒక్క జవాను ముందు కూడా మోదీ నిలబడలేరని విమర్శించారు.

అంతకుముందు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి జరుపుకున్న ప్రధాని మోదీ విపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు.దేశంలో సాయుధ నక్సలిజం బలహీనపడినప్పటికీ, 'దిమాగీ నక్సల్స్' ముప్పు ఇంకా కొనసాగుతోందని ఆరోపించారు. వీరు వివిధ సంస్థలు, రాజకీయ పార్టీల్లోకి చొరబడి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. దేశ భద్రతను కాపాడేందుకు ఇలాంటి శక్తులను గుర్తించి ఓడించాలని పిలుపునిచ్చారు. నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతా సిబ్బందికి గత ప్రభుత్వాలు పూర్తి స్వేచ్ఛ కల్పించలేదని మోదీ విమర్శించారు. నక్సలైట్లు దాడులకు పాల్పడినప్పుడు ధీటుగా సమాధానం చెప్పే అవకాశం భద్రతా దళాలకు ఉండేది కాదని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం జవాన్లకు నిర్ణయాలు తీసుకునే పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందని పేర్కొన్నారు. అడవుల్లో సాయుధ నక్సలైట్ల ప్రభావం తగ్గినప్పటికీ, భావజాల రూపంలో నక్సలిజం ఇంకా సవాల్‌గా ఉందని వ్యాఖ్యానించారు. విదేశీ శక్తుల ప్రభావం, భారత ఆర్థిక వ్యవస్థపై వాటి నియంత్రణ వంటి అంశాలపై గతంలోనూ రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రధాని విదేశీ శక్తుల మద్దతుతోనే అధికారంలో కొనసాగుతున్నారంటూ ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై బహిరంగ చర్చకు రావాలని అప్పట్లోనే సవాల్ విసిరారు. ఇప్పుడు మోదీ చేసిన తాజా వ్యాఖ్యలతో మరోసారి ఈ వివాదం రాజకీయంగా వేడెక్కింది. రాహుల్ సవాల్‌కు ప్రధాని మోదీ ఎలా స్పందిస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



రైతు సమస్యలే అజెండా..

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో

తెలంగాణలో రైతుల సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకొని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ పోరాటాన్ని ముమ్మరం చేస్తోంది. సాగునీటి సమస్యలు, పంట నష్టాలు, ఎరువుల కొరత, రైతు భరోసా నిధుల విడుదల వంటి అంశాలను ప్రస్తావిస్తూ వరుసగా రైతు గర్జన సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆదిలాబాద్‌లో సభ నిర్వహించిన పార్టీ.. తదుపరి నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ రైతు గర్జన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 1న ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ నెల 11న నిర్మల్‌లో, 18న నిజామాబాద్‌లో రైతు గర్జన సభలు నిర్వహించనున్నారు. ఈ సభల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పార్టీ భావిస్తోంది. సాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, ఎరువుల కొరత, రైతు భరోసా నిధులు, పంట నష్టాలకు పరిహారం వంటి అంశాలను సభల్లో ప్రధానంగా ప్రస్తావించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించి పంటలను కాపాడే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎండిపోతున్న పంటలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ సాయం వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు.రైతు గర్జన సభలతో పాటు పంట నష్టాలు, అప్పుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలను పరామర్శించడంపైనా బీఆర్ఎస్ దృష్టి సారించింది. మరణించిన రైతుల కుటుంబాలను పార్టీ నేతలు నేరుగా కలిసి పరామర్శిస్తున్నారు. పార్టీ తరపున ఆర్థిక సాయం అందిస్తూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ అందక ఎండిపోతున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.మాజీ మంత్రి హరీశ్‌రావు ఇటీవల వనపర్తి, నర్సాపూర్ నియోజకవర్గాల్లో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇతర జిల్లాల్లోనూ పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను తెలుసుకుంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నారు. కొందరు నేతలు స్థానికంగా పాదయాత్రలు సైతం నిర్వహిస్తున్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వ వైఫల్యాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై బీఆర్ఎస్ దృష్టి పెట్టింది. రానున్న రోజుల్లో మరిన్ని రైతు కేంద్రిత కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. రైతు గర్జన సభలు, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రైతుల సమస్యలను రాజకీయ అజెండాగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నది పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది.


అగ్రికల్చర్ వర్సిటీ వీసీపై లైంగిక వేధింపుల ఆరోపణలు

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ చేసిన ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు ఈ నెల 12న విచారణకు హాజరుకావాలని వీసీ జానయ్యకు నోటీసులు జారీ చేసింది. విశ్వవిద్యాలయంలో పనిచేసి ప్రస్తుతం నిజామాబాద్‌కు బదిలీ అయిన మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ వీసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి తరచూ అనుచితంగా ప్రవర్తించారని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అర్ధరాత్రి ఫోన్ కాల్స్ చేయడంతో పాటు ఏకాంతంగా కలవాలని ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. జనవరి 1న పీహెచ్‌డీ డిప్యుటేషన్ పొడిగింపు అనుమతి కోసం వర్సిటీకి వెళ్లిన సమయంలో తనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని తెలిపారు.తనకు ఎదురైన వేధింపులపై విశ్వవిద్యాలయ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పందించి స్వతంత్ర కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వీసీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో నిరసనలు కొనసాగుతున్నాయి. మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బోధన, బోధనేతర సిబ్బంది సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని, విచారణ పారదర్శకంగా సాగేందుకు వీసీ జానయ్యను తక్షణమే పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు వీసీ అల్దాస్ జానయ్యపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బదిలీ చేశారనే అక్కసుతోనే ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని వారు అభిప్రాయపడ్డారు. దీంతో వర్సిటీలో ఈ వ్యవహారం ఉద్యోగ సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలకు దారితీసింది. మహిళా కమిషన్ విచారణలో వెల్లడయ్యే అంశాలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :



రష్యాతో యుద్ధాన్ని ముగించి, శాంతియుత పరిష్కారాలను అన్వేషించేందుకు అన్నివిధాలా తోడ్పడేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ వివరించారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో సంక్లిష్టతలు కొనసాగుతున్న వేళ జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సంభాషణలో ఘర్షణలకు సంబంధించి ప్రస్తుత పరిణామాలను మోదీకి జెలెన్‌స్కీ వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.యుద్ధాన్ని చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలనే భారతదేశపు స్థిరమైన వైఖరిని జెలెన్‌స్కీకి మోదీ గుర్తుచేసినట్లు పేర్కొంది. యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే దిశగా సాగే అన్ని రకాల ప్రయత్నాలకు భారత్ మద్దతిస్తుందని మోదీ హామీ ఇచ్చినట్లు తెలిపింది.

భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారం

మరోవైపు, ఇరు దేశాల ప్రజల పరస్పర ప్రయోజనాల కోసం వివిధ రంగాలలో భారత్ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్నిమరింతబలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు పీఎంఓ పేర్కొంది. ఈ టెలిఫోన్ సంభాషణ తర్వాత ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. "ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడడం సంతోషంగా ఉంది. మేము మా విస్తృత ద్వైపాక్షిక సహకారం గురించి మాట్లాడాం. భారత్ఉక్రెయిన్ సంబంధాలనుమరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాం" అని రాశారు.ప్రస్తుత ఘర్షణలు, వాటి వల్ల ఎదురవుతున్న మానవతా సంక్షోభం గురించి, శాంతి పునరుద్ధరణ కోసం జరుగుతున్న ప్రయత్నాలపై జెలెన్‌స్కీ తన అభిప్రాయాలను చెప్పారని మోదీ అన్నారు. ఘర్షణలకు శాంతియుత పరిష్కారం కోసం సాధ్యమైన ప్రతి విధంగానూ సహకరించడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు.

భారత్ సహకారంపై కీవ్ ఆధారపడి ఉంది: జెలెన్‌స్కీ

మరోవైపు రష్యాతో యుద్ధాన్ని ముగించడానికి "భారతదేశం సహకారం" ఉక్రెయిన్‌కు ఎంతో అవసరమని జెలెన్‌స్కీ అన్నారు. శాంతి, దౌత్యం పట్ల భారతదేశ అంకితభావాన్ని ఉక్రెయిన్ అభినందిస్తుందని పేర్కొన్నారు. "యావత్ ప్రపంచం ఇప్పుడు ఈ భయంకరమైన యుద్ధాన్ని గౌరవప్రదంగా, శాశ్వత శాంతితో ముగించడానికి ప్రయత్నిస్తోంది.ఇలాంటి సమయంలో మేము భారతదేశ సహకారంపై ఆధారపడి ఉన్నాం" అని జెలెన్స్కీ అన్నారు.

మోదీ దగ్గర మంచి ఆలోచనలు ఉన్నాయ్: పుతిన్

గత నెలలో ప్రధాని మంత్రి నరేంద్ర మోదీపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. దాదాపు 4 ఏళ్లుగా ఉక్రెయిన్‌తో సాగుతున్న వివాదాన్ని ముగించడానికి మోదీ చేస్తున్న ప్రయత్నాల గురించి ప్రస్తావించారు. శాంతియుత పరిష్కారం కోసం ఆయన వద్ద మంచి ఆలోచనలు ఉన్నాయని కొనియాడారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించాలని ప్రయత్నించే నాయకుల్లో మోదీ ఒకరని చెప్పారు. పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాల కోసం మోదీ తనవంతు కృషి చేస్తున్నారని అన్నారు. రష్యాలో జరిగిన ఓ కార్యక్రమంలో పుతిన్ ఈ మేరకు మాట్లాడారు.

'మోదీతో మాకు మంచి స్నేహం ఉంది'

మోదీతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ వివాదాన్ని ముగించే విషయంపై మోదీ నిరంతరం తనతో మాట్లాడుతుంటారని ఆయన చెప్పారు. ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనడంలో మోదీ చురుగ్గా వ్యవహరిస్తున్నారని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ వివాదంలో మోదీ తటస్థ వైఖరిని అవలంబిస్తున్నారని, అయితే, యుద్ధం త్వరగా ముగియాలనే ఆయన ఆకాంక్షిస్తున్నారని చెప్పారు.మోదీ ఆలోచనలకు పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు.

వాయు కాలుష్యంతో 20 లక్షల మంది మృతి

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

దేశంలో వాయు కాలుష్యం తీవ్ర ఆరోగ్య సంక్షోభంగా మారుతోందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. 2023లో భారత్‌లో సుమారు 20 లక్షల మంది వాయు కాలుష్యం కారణంగా మరణించినట్లు ఫిక్కీ-ఈవై నివేదిక వెల్లడించిందని పేర్కొంది. దేశంలో నమోదైన మొత్తం మరణాల్లో 22 శాతం వాయు కాలుష్యంతో ముడిపడి ఉన్నాయని తెలిపింది. ఈ పరిస్థితిపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు.ఫిక్కీ-ఈవై నివేదికను ప్రస్తావిస్తూ సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. వాయు కాలుష్యం కారణంగా తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలు, మరణాలపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించడం లేదని జైరాం రమేశ్ ఆరోపించారు. పార్లమెంటులోనూ, బయటా పలు అధ్యయనాలను ప్రభుత్వం తోసిపుచ్చిందని విమర్శించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంత ముఖ్యమో.. ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించడం అంతకంటే ముఖ్యమని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కాలుష్య నియంత్రణకు మూడు కీలక సూచనలు

వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం మూడు కీలక మార్పులు చేపట్టాలని జైరాం రమేశ్ సూచించారు.

1. కాలుష్య ప్రమాణాల కఠినతరం: పీఎం2.5, ఓజోన్ కాలుష్యానికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాలకు అనుగుణంగా గాలి నాణ్యత ప్రమాణాలను సవరించాలి.

2.జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో మార్పులు: జాతీయ స్వచ్ఛవాయు కార్యక్రమాన్ని (ఎన్‌సీఏపీ) పునర్వ్యవస్థీకరించి సూక్ష్మ ధూళి కణాలు, ఓజోన్ కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

3.సమగ్ర స్వచ్ఛ వాయు చట్టం: 1981 నాటి వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం స్థానంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సూచించారు.

ఢిల్లీ కాలుష్యంపై పవన్ ఖేడా విమర్శలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత పెరుగుతున్నా ప్రభుత్వాలు సమర్థంగా చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా విమర్శించారు. కేంద్రంతో పాటు ఢిల్లీలోనూ బీజేపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో కాలుష్య సమస్యకు ఇతరులను బాధ్యులుగా చూపలేరని వ్యాఖ్యానించారు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ పరస్పరం విమర్శలు చేసుకున్నప్పటికీ ప్రజలు మాత్రం కాలుష్యంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విధించిన ఆంక్షలను అమలు చేయడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు.

టపాసుల అనుమతులపై రషీద్ అల్వీ అభ్యంతరం

దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చేందుకు ప్రత్యేక సమయాలను కేటాయించడంపై కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ఉన్న సమయంలో టపాసులకు అనుమతులు ఇవ్వడం ప్రజారోగ్యానికి హానికరమని విమర్శించారు.అధికారం, ఓట్ల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు సూచించిన సమయ పరిమితులను ప్రజలు పాటించకపోవడం కూడా సమస్యగా మారిందని పేర్కొన్నారు.

ఢిల్లీలో 400కు చేరువైన ఏక్యూఐ

దీపావళి వేడుకల మరుసటి రోజు సోమవారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత గణనీయంగా పడిపోయింది. వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 మార్కుకు చేరువ కావడంతో రాజధానిలోని పలు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజామున రహదారులపై దృశ్యమానత తగ్గిపోయింది. గాలి నాణ్యత తీవ్ర స్థాయికి చేరువ కావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్య నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితులు మరోసారి తెరపైకి తెచ్చాయి.



రంగారెడ్డి కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహించినందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది.కోర్టు ధిక్కరణ కేసులో ఆయనకు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఐఏఎస్ అధికారి అయినప్పటికీ న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలని బాధితులు చేసిన విజ్ఞప్తిపై వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాధితుల వినతిపత్రాన్ని 60 రోజుల్లోగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో హైకోర్టు ఆదేశించింది. అయితే నిర్దేశిత గడువు ముగిసినా కలెక్టర్ నుంచి స్పందన రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించి బాధితులకు నోటీసులు జారీ చేశారు. 2026 ఫిబ్రవరి 26న బాధితుల వినతిని అధికారులు తిరస్కరించగా, జులై 8న మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జరిగిన జాప్యం, నిర్లక్ష్యంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ



కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి కలకలం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగుచూసింది. కేసు ఛార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరించడంతో పాటు త్వరగా దాఖలు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్‌ఐ కొండారెడ్డి శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా నాగారంలోని శిల్పానగర్ కాలనీలో ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయాన్ని హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ వెల్లడించారు.

రూ.5 లక్షల డిమాండ్.. రూ.2 లక్షలకు ఒప్పందం

కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై చీటింగ్, వరకట్న నిషేధ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై ఉన్న సదరు వ్యక్తి కోర్టు ఆదేశాల మేరకు ప్రతి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో ఛార్జిషీట్‌లో తనకు అనుకూలంగా వ్యవహరించడంతో పాటు త్వరగా దాఖలు చేసేందుకు ఎస్‌ఐ శ్రీనివాస్ రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు చెప్పడంతో చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదిరింది.

ఏసీబీ వలలో ఎస్‌ఐ

లంచం కోసం ఎస్‌ఐ తరచూ ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు నగదును ఓ కవర్‌లో పెట్టుకుని నాగారంలోని శిల్పానగర్ కాలనీకి వెళ్లాడు. అక్కడ బాధితుడి నుంచి ఎస్‌ఐ రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ బృందం దాడి చేసి పట్టుకుంది. ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

గతంలోనూ రూ.10.50 లక్షలు తీసుకున్నారంటూ ఆరోపణలు

ఇదే కేసుకు సంబంధించి గతంలో సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ శ్రీనివాస్ తన నుంచి రూ.10.50 లక్షలు వసూలు చేశారని బాధితుడు ముద్దం సంపత్ యాదవ్ ఆరోపించారు. నాగారంలోని ఓ భూమి వివాదానికి సంబంధించి గతంలో తనపై నమోదైన కేసును తగిన ఆధారాలు లేవంటూ కోర్టు కొట్టివేసిందని తెలిపారు. అనంతరం మరో కేసు నమోదు చేసి, ఛార్జిషీట్‌లో తనకు అనుకూలంగా వ్యవహరించేందుకు డబ్బులు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక తనకు అనుకూలంగా వచ్చేలా చేయాలంటూ లంచం అడిగినట్లు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వరుస ఏసీబీ కేసులతో కీసరలో కలకలం

కీసర ప్రాంతంలో ఈ ఏడాది వరుసగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) చర్యలు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరిలో హోంగార్డు నగేశ్ వ్యవహారం, సెప్టెంబర్ 17న స్టేషన్ బెయిల్ విషయంలో రూ.10 లక్షలు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై సీఐ, ఎస్‌ఐలపై చర్యలు, అక్టోబర్ 15న డిప్యూటీ తహసీల్దార్ ఉదంతం, తాజాగా ఎస్‌ఐ శ్రీనివాస్ పట్టుబడటం స్థానికంగా కలకలం రేపుతున్నాయి.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



దీపావళి వేళ అగ్నిప్రమాదాల కలకలం

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా :

దీపావళి పండుగ వేళ బాణాసంచా నిప్పురవ్వలు నగరంలో ప్రమాదాలకు కారణమయ్యాయి. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పలు చోట్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలు దుకాణాలు, గోదాముల్లో మంటలు చెలరేగడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. అయితే ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఫ్లవర్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంబజార్‌లో ఆదివారం రాత్రి ఓ భవనంలో మంటలు చెలరేగాయి. బాణాసంచా నిప్పురవ్వలు పడటంతో మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. భారీగా పొగలు అలుముకోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిమెట్లలో ఓ స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. బాణాసంచా నిప్పురవ్వలు ఎగిరిపడటంతో మంటలు చెలరేగినట్లు సమాచారం. దీంతో దుకాణంలోని స్క్రాప్ మొత్తం అగ్నికి ఆహుతైంది. రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ఓల్డ్ విలేజ్‌లోని హనుమాన్ దేవాలయం సమీపంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన డెకరేషన్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నివాసాల మధ్య గోదాం ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ పరిధిలోని బండిమెట్ మారుతి వీధిలో ఉన్న సాయి బాలాజీ డిస్ట్రిబ్యూటర్ డ్రగ్ మార్ట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్తి నష్టంపై ఇంకా అంచనా వేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది. కూకట్‌పల్లిలోని ఆస్బెస్టాస్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున మరో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పేపర్ ప్లేట్లు, టీ కప్పుల తయారీ కంపెనీలో మొదలైన మంటలు పక్కనే ఉన్న నెయ్యి, కుర్‌కురే, హల్దీరామ్ స్టాక్ గోదాములకు వ్యాపించాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజిన్లతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

వరుస అగ్నిప్రమాదాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో కలకలం రేగింది. అదృష్టవశాత్తూ ఎక్కడా ప్రాణనష్టం జరగలేదు. అయితే దుకాణాలు, గోదాముల్లో నిల్వ ఉంచిన వస్తువులు కాలిపోవడంతో లక్షలాది రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

- ఓపీ చూడటం డాక్టర్ వంతు... బయట మెడికల్ షాప్‌కి రాయడం నర్సుల వంతు!
- సూపరింటెండెంట్‌ది కుర్చీపై మోజా... రోగుల చావులతో వ్యాపారమా?
- లక్షల్లో జీతాలు తింటూ 'రిఫర్' దందాకి అడ్డాగా మార్చేశారా?
- ఓపీ రాస్తే ముట్టుకోరు... మెడికల్ షాప్‌లతో కమీషన్ల దొంగ ముఠా.!
- హాస్పిటల్ నిర్వీర్యం వెనుక సూపరింటెండెంట్ 'ప్రైవేట్' కుట్ర!
- లక్షల్లో జీతాలు తింటూ 'రిఫర్' దందా నడుపుతున్న సూపరింటెండెంట్ యంత్రాంగం!
- రోగుల ప్రాణాలు తీస్తున్న సర్కారు దవాఖానా... కలెక్టర్ గారూ ఇకనైనా చూడండి ..!

శేవాల దిబ్బలా జిల్లా ఆసుపత్రి...!

మందులు నిల్లు... బయటకు రాస్తే ఫుల్లు!





భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హెడ్‌క్వార్టర్స్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం ఇవాళ రోగులను భ్రతికించే వైద్యాలయం కాదు... రోజుకో ప్రాణాన్ని బలితీసుకుంటున్న 'మరణాల కర్మాగారం'గా మారింది! ఆసుపత్రి ప్రాంగణంలోకి అడుగుపెడితే కనిపించే అపరిశుభ్రత, సరైన సేవలు అందక రోగులు అనుభవిస్తున్న నరకయాతన వర్ణనాతీతం. జేబులో పైసా లేక ప్రాణాలు కాపాడుకోవడానికి వస్తే, ఇక్కడ లభిస్తున్నది వైద్యం కాదు... నిలువు దోపిడీ!

మందులు కరువు... సూదులు కరువు... చూతు మంత్రానికే సేవలు.!

కోట్లాది రూపాయల నిధులు కాగితాల్లోనే మాయమవుతున్నాయి తప్ప, ఆసుపత్రిలో కనీసం జ్వరం బిళ్ళ, ఒక ఇంజెక్షన్ కూడా ఉండటం లేదు. రోగి వచ్చి నిలబడితే డాక్టర్లు కనీసం ముట్టుకోకుండా చూతు మంత్రంలా సరిపెడుతుంటే... నర్సులు ఏమాత్రం కనికరం లేకుండా తెల్ల కాగితాల మీద బయట మెడికల్ షాపుల పేర్లు రాసి చేతిలో పెడుతున్నారు. బయట వేలకు వేలు పోసి మందులు కొనుక్కోలేక నిరుపేదలు రోడ్డుపైనే అల్లాడిపోతున్నారు.

లక్షల్లో జీతాలు... 'రిఫర్'ల వ్యాపారం!

ప్రభుత్వం నుంచి నెలనెలా లక్షల్లో జీతాలు మింగేస్తున్న వైద్యులకు పేషెంట్లను చూడటానికి చేతులు రావు. ఆసుపత్రి సూపరింటెండెంట్, యంత్రాంగం కేవలం 'రిఫర్ దందా'తోనే కాలం వెళ్లదీస్తున్నారు. వచ్చిన ప్రతి రోగికి ఇక్కడ సరైన చికిత్స అందించకుండా ప్రైవేట్ దవాఖానాలకు రిఫర్ చేస్తూ దళారీ కమిషన్లు పొందుతున్నారు. వైద్యం అందక రోజుకో ప్రాణం గాల్లో కలిసిపోతున్నా ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌కు కనీసం చలనం లేదు.

పగలు 'ప్రభుత్వ' డ్యూటీ ఎగవేత... రాత్రి 'ట్రైనింగ్' నర్సులతో ప్రయోగాలు!

డ్యూటీ సమయంలో ఆసుపత్రిలో ఉండాల్సిన డాక్టర్లు ప్రైవేట్ క్లినిక్‌లలో ప్రత్యక్షమవుతుంటే, ఆసుపత్రిని నమ్మొచ్చిన పేదలకు రాత్రి వేళల్లో ఎలాంటి అనుభవం లేని ట్రైనింగ్ నర్సులతో చికిత్సలు చేయిస్తున్నారు. సరైన అవగాహన లేని వైద్యంతో రోగుల ప్రాణాలు తీస్తున్నారు. ఆదివారాలు, పండుగలు వస్తే అసలు ఆసుపత్రి వైపే కన్నెత్తి చూసే నాథుడే లేడు.

నిద్రపోతున్న అధికారులారా... ఇంకెన్ని ప్రాణాలు బలితీసుకుంటారు?

ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ షాపులకు ఏజెంట్‌గా మార్చిన సూపరింటెండెంట్‌పై, మందుల కొరత సృష్టించి బయటకు రాస్తున్న వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటి?

జిల్లా కలెక్టర్ గారికి విజ్ఞప్తి జర చూడండి

అయ్యా కలెక్టర్ గారు... మీ చాంబర్ వదిలి ఒక్కసారి అకస్మాత్తుగా జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేయండి! డ్యూటీ ఎగ్గొట్టి బయట మందులు రాస్తూ, ప్రైవేట్‌కి రిఫర్ చేస్తున్న దొంగ డాక్టర్ల లైసెన్సులు రద్దు చేయండి. మందుల కరువుకు కారణమైన సూపరింటెండెంట్‌పై వెంటనే సస్పెన్షన్ వేటు వేయండి. నిరుపేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ వ్యవస్థను బాగు చేయకపోతే బాధితుల ఉసురు మీకు తగలక మానదు!





పీసీసీ అధికార ప్రతినిధిగా ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్ నియామకం

- 20 ఏళ్ల పార్టీ సేవలకు గుర్తింపు..
- కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ నాయకత్వం
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి

కరీంనగర్ తెలంగాణ చౌరస్తా

కాంగ్రెస్ పార్టీ కోసం రెండు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధిగా అవకాశం లభించింది. పీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సుదీర్ఘ రాజకీయ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలు

విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సిరాజ్ హుస్సేన్ గత 20 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేశారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడిగా, మహదేవ్‌పూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం భూపాలపల్లి నియోజకవర్గ టీపీసీసీ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్నారు. పార్టీ నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర నాయకులతో కలిసి తెలంగాణవ్యాప్తంగా పాదయాత్రలో పాల్గొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థికి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేశారు. అంతేకాకుండా గుల్బర్గా లోక్‌సభ ఎన్నికల్లో ఏఐసీసీ మైనారిటీ విభాగం పరిశీలకుడిగా, 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో చుంచురా నియోజకవర్గ పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఎస్‌ఐఆర్ మాస్టర్ ట్రైనర్‌గా కూడా సేవలందించారు.



సామాజిక సేవలోనూ ప్రత్యేక గుర్తింపు

రాజకీయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సిరాజ్ హుస్సేన్ చురుగ్గా పాల్గొన్నారు. పేదలకు రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందేలా కృషి చేశారు. కరోనా సమయంలో నిరుపేదలకు ఆహార పొట్లాలు, కూరగాయలు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జర్నలిజం రంగంలోనూ పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా

పీసీసీ అధికార ప్రతినిధిగా నియామకం కావడంపై సిరాజ్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా పదవులను ఆశించకుండా పార్టీ కార్యకర్తగా అంకితభావంతో పనిచేశానని తెలిపారు. తన సేవలను గుర్తించి కీలక బాధ్యత అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం ఇస్తానని పేర్కొన్నారు. పార్టీ విధానాలు, అధిష్ఠానం నిర్ణయాలు, ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తానన్నారు. కరీంనగర్ జిల్లా ప్రజలకు, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తూ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.


పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పార్టీ నాయకులందరికీ సిరాజ్ హుస్సేన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ పార్టీ అభివృద్ధి, ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు.



ఒకేరోజు 11 మంది హత్య

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

దీపావళి రోజున తమిళనాడులో వేర్వేరు చోట్ల ఓ ఎస్సై సహా 11 మంది హత్యకు గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుచ్చిలో ఇద్దరు బాలురు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వారిని నరికి చంపేశారు. చెన్నైలో ఓ ఐటీ ఉద్యోగి టపాసులు కాల్చుతుండగా, వేరే వాళ్లు గొడవకు దిగి ఆయన్ను హత్య చేశారు. మద్యం మత్తులో రోడ్డుపై టపాసులు కాల్చుతూ ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్న యువకులను.. తేని డీఎస్పీ కార్యాలయంలో పని చేస్తున్న ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌కుమార్ (55) పక్కకు వెళ్లమని చెప్పగా, కోపంతో వారు ఆయనపై దాడి చేసి హతమార్చారు. కడలూర్‌లో ఓ రౌడీ.. మరో ఇద్దరు రౌడీలతో కలిసి మద్యం తాగుతున్నప్పుడు జరిగిన గొడవలో చనిపోయాడు. శివగంగైలో ఓ రౌడీ బెయిల్‌పై బయటకు వచ్చి వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని చంపేశారు. ఇదే జిల్లాలో ప్రైవేట్ ఉద్యోగి స్నేహితులతో కలిసి మాట్లాడుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చారు. చెన్నైలో పాతకక్షలతో యువకుడు, తిరువళ్లూర్‌లో వివాహేతర సంబంధంతో మహిళ హత్యకు గురయ్యారు. దిండుక్కల్‌లో భార్యను హత్య చేసి భర్త పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కళ్లకురిచ్చిలో అస్తి వివాదాలతో పెద్దనాన్నని యువకుడు హత్య చేశాడు. ఈ ఘటనలపై ఆయా ప్రాంతాల్లో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 57వ జన్మదిన సందర్భంగా ఆదివారం కొడంగల్ లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు, దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి ప్రతినిధి చిలుక మధుసూదన్ రెడ్డి



నారాయణ ప్రీమియర్ లీగ్ జోనల్ విజేతగా హయత్‌నగర్ బ్రాంచ్

- వనస్థలిపురం జోన్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ కైవసం
- ఘనంగా ముగిసిన క్రీడా పోటీలు
- పాల్గొన్న జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు

ఎల్ బినగర్,(తెలంగాణ చౌరస్తా):

నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలలో హయత్‌నగర్ బ్రాంచ్ అద్భుత ప్రతిభను కనబరిచి వనస్థలిపురం జోన్ ఛాంపియన్‌గా నిలిచింది.చదువులోనే కాకుండా క్రీడారంగంలోనూ తాము ఎవరికీ తీసిపోమని నిరూపిస్తూ హయత్‌నగర్ నారాయణ విద్యార్థులు ఓవర్‌ఆల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు.ఈ



పోటీలలో భాగంగా విద్యార్థులకు కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, డాడ్జ్‌బాల్, రన్నింగ్, చెస్ తదితర విభాగాల్లో క్రీడలు నిర్వహించారు.

ట్రోఫీ బహుకరణ:

విజేతగా నిలిచిన హయత్‌నగర్ బ్రాంచ్‌కు జీఎం గోపాల్ రెడ్డి, వనస్థలిపురం ఏజీఎం రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరై ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి, మానస,హైస్కూల్ ఆర్ అండ్ డి శివరంజని, ఇంచార్జి రోహిణి, ఈచాంప్స్ ఆర్ అండ్ డి మహేశ్వరి, ఈకిడ్స్ ఆర్ అండ్ డి మీనా, స్పోర్ట్స్ ఆర్‌పి సురేష్, సాఫ్ట్ స్కిల్స్ ఇంచార్జ్ జాజి రెడ్డి,హైస్కూల్ కోఆర్డినేటర్ సృజన్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ దివ్య, ఈకిడ్స్ కోఆర్డినేటర్ ప్రియాంక, ఏడీ మంజుల, ఈచాంప్స్ విపి కవిత, ఈకిడ్స్ విపి పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వర్కింగ్ జర్నలిస్టులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి

- రోడ్డు ప్రమాదానికి గురైన రిపోర్టర్ రాయిశెట్టి ఉపేందర్‌కు జర్నలిస్టుల పరామర్శ

తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:

అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు పొందిన పత్రికల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీనియర్ వర్కింగ్ జర్నలిస్ట్ కొమ్మనబోయిన యాకయ్య, మాదిగ జర్నలిస్టుల ఫోరం జిల్లా నాయకులు వెల్తూరి పూర్ణ రామ్ చందర్ కోరారు. జర్నలిస్టులకు వైద్య, విద్యా సౌకర్యాలు కల్పించేలా జర్నలిస్టు సంఘాలు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన మన ప్రగతి రిపోర్టర్ రాయిశెట్టి ఉపేందర్‌ను సోమవారం తొర్రూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో వర్కింగ్ జర్నలిస్టులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రికల్లో పనిచేస్తున్న రిపోర్టర్లకు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.జర్నలిస్టు సంఘాలు కేవలం సభ్యత్వాలకే పరిమితం కాకుండా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. వైద్యం, విద్య వంటి ప్రాథమిక హక్కుల కోసం అక్రిడిటేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా వృత్తిలో కొనసాగుతున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు సంక్షేమ పథకాలు అందేలా సంఘాలన్నీ ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జర్నలిస్ట్ మహంకాళి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నరావిరాళ గ్రామంలో దీపావళి సంబరాలు

- ఇందిరమ్మ ఇంట్లో వేడుకలు

అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:

ప్రజలందరూ ఎంతో ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం చినరావిరాల గ్రామ సర్పంచ్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పర్వదినం సందర్భంగా సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లలోకి వెళ్లి వేడుకలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నారెడ్డి రిషితా సతీష్ రెడ్డి,అబ్బవతి బాలయ్య, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగం బాల్ రెడ్డి, కొమురవెల్లి రేణుక, గండికోట శారద గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత ఈ వేడుకల్లో ప్రత్యేకంగా పాల్గొని గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరింట్లోనూ ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, దీపాల కాంతుల వలె ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి.

కమాన్‌పూర్‌లో అలాయ్ బలాయ్ వేడుకలు



- రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ సమ్మేళనం
- మానవ సంబంధాలకు పెద్దపీట
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్

కమాన్‌పూర్ | తెలంగాణ చౌరస్తా :

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహ ఆవరణలో ఆదివారం అలాయ్ బలాయ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వన్ వరల్డ్ వన్ పీపుల్ వ్యవస్థాపకుడు రాణవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం ప్రారంభమైన వేడుకలు సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక లక్ష్మీపూజతో ముగిశాయి. ఈ సందర్భంగా గాండ్ల మోహన్ మాట్లాడుతూ.. సమాజ సేవే లక్ష్యంగా నిస్వార్థంగా పనిచేస్తున్న రాణవేణి లక్ష్మణ్‌ను అభినందించారు. ప్రస్తుత సమాజంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అలాయ్ బలాయ్ వంటి కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం, ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు .ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వడ్లకొండ తిరుపతి గౌడ్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



జన్మదిన శుభాకాంక్షలు అన్నా

- సీఎంకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

రామన్నపేట | తెలంగాణ చౌరస్తా :

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలతో పాటు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వేముల వీరేశం వెంట నియోజకవర్గ నాయకులు చామల శ్రీనివాస్, లింగాల



వెంకన్న, యాస కరుణాకర్ రెడ్డి పాల్గొని ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

ఝాన్సీ రెడ్డిపై అసత్య ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు

- టీపీసీసీ ఉపాధ్యక్షురాలిపై తప్పుడు కథనాలు ప్రచురించారంటూ ఆగ్రహం
- కొడకండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..
- బాధ్యులపై చర్యలు సుకోవాలని డిమాండ్

కొడకండ్ల | తెలంగాణ చౌరస్తా

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డిపై కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో ప్రచురితమైన కథనాలు, ఆరోపణలను కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిరాధార ఆరోపణలతో వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంతో పాటు కొడకండ్ల ప్రాంత అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఝాన్సీ రెడ్డిపై రాజకీయ కక్షతోనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆమె స్థానికత, ఎన్నారై అంశాలను తెరపైకి తీసుకొచ్చి అనవసర వివాదాలు సృష్టించడం సరికాదన్నారు.ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తామని, అయితే వాస్తవాలను నిర్ధారించుకోకుండా నిరాధార కథనాలు ప్రచురించడం జర్నలిజం విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఒక మహిళా నాయకురాలి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కథనాలు ప్రచురించడం తగదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు పత్రిక యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దారవత్ సురేష్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సోమారపు శ్రీకాంత్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య శీను నాయక్, జిల్లా కార్యదర్శి ధర్మారపు బిక్షపతి, ఎస్టీ సెల్ నాయకులు శ్రీను నాయక్, టౌన్ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు మస్రం రవీందర్, మాజీ సర్పంచ్ పసునూరి మధుసూదన్, మాజీ ఎంపీటీసీ అందె ఎల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ బత్తుల వెంకన్న, ఉప్పలయ్య, వార్డు సభ్యుడు అందే అరుణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట దామోదర్, సీనియర్ నాయకులు మార్గం రవీందర్, దేశగాని కుమారస్వామి, నాయిని కనకయ్య, నాగరాజు, అందె మల్లేష్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసుల అవగాహన

- ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...పోలీసులు

రాంనగర్ | తెలంగాణ చౌరస్తా :

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారాసిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రాంనగర్ ఈసేవ కేంద్రం వద్ద ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు.ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని హెచ్చరించారు.ఎవరైనా సైబర్ నేరానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో వారాసిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ప్రైవేట్ చిట్టీల పేరుతో రూ.55.33 లక్షల టోకరా...!

- అధిక లాభాల ఆశచూపి రూ.55.33 లక్షలు కాజేసిన వైనం.. కొత్తగూడెంలో గుట్టురట్టు!
- అనధికారిక ప్రైవేట్ చిట్టీల పేరుతో ఘరానా మోసం.. కట్టుల కుటుంబంలోని ముగ్గురు అరెస్ట్!
- కొత్తగూడెం డి ఎస్ పి ఆదినారాయణ

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:

ప్రైవేట్ చిట్టీల పేరుతో అమాయక ప్రజల నుంచి రూ.55.33 లక్షలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం పట్టణంలోని న్యూ గొల్లగూడెంకు చెందిన కట్టుల సరోజ (62), కట్టుల చంద్రకళ (37), కట్టుల కుమార్ (40) కలిసి మొత్తం 11 ప్రైవేట్ చిట్టీలు నిర్వహిస్తూ ఖాతాదారుల నుంచి రూ.55,33,745 వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలా వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించకుండా వారు ఖాతాదారులను మోసం చేసినట్లు గుర్తించారు.ఈ ఘటనపై కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 188/2026 కింద కేసు నమోదైంది. నమ్మదగిన సమాచారం మేరకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద నిందితులు ముగ్గురిని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద చిట్టీల లావాదేవీల వివరాలు నమోదు చేసిన ఐదు బుక్స్‌ను స్వాధీనం చేసుకొని, వారిని న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.

అప్రమత్తంగా ఉండాలి డీఎస్పీ

ప్రజలు అధిక లాభాలు వస్తాయనే ఆశతో అనధికారిక ప్రైవేట్ చిట్టీలలో చేరి తమ కష్టార్జితాన్ని కోల్పోవద్దని డీఎస్పీ సూచించారు. చిట్టీలలో చేరే ముందు నిర్వాహకుల చట్టబద్ధత, అనుమతులను పరిశీలించాలని, సరైన రసీదులు లేదా రికార్డులు లేకుండా ఎవరికీ నగదు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధంగా చిట్టీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేసే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అభినందన ఈ కేసును విజయవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలను ఆర్థిక మోసాల నుంచి రక్షించేందుకు అధికారులు నిరంతరం నిఘా కొనసాగించాలని ఆయన సూచించారు.





పీజేఆర్ స్టేడియం యోగా ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించండి

- ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్‌కు యోగాభ్యాసకుల వినతి

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

పీజేఆర్ స్టేడియంలోని యోగా ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ యోగాభ్యాసకులు సోమవారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. యోగా శిక్షకులు పుట్ట వినయ్ కుమార్ గౌడ్, జగన్నాథం ఆధ్వర్యంలో యోగా ప్రాంగణంలో ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.గత 12 సంవత్సరాలుగా పతంజలి యోగా ప్రోటోకాల్ ప్రకారం పీజేఆర్ స్టేడియంలో ప్రతిరోజూ ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగాభ్యాసకులందరూ ప్రతి నెలా జీహెచ్ఎంసీ/సీఎంసీకి నిర్ణీత అద్దె చెల్లిస్తున్నప్పటికీ, అందుకు తగిన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో యోగా సాధనకు ఆటంకాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు.యోగా ప్రాంగణానికి పైకప్పు నిర్మించాలని, పాముల బెడద నివారణకు చుట్టూ మూడు అడుగుల ఎత్తులో ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. యోగా మ్యాట్లు, సౌండ్ సిస్టమ్, ఇతర పరికరాలను భద్రపరిచేందుకు రెండు గదులు నిర్మించాలని, పెద్దుకు చుట్టూ గాలి, వెలుతురు ప్రసరించేలా మెష్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేడియంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నందున యోగా ప్రాంగణంలోనూ వెంటనే అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.యోగాభ్యాసకుల వినతిపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 11వ తేదీన జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులతో కలిసి పీజేఆర్ స్టేడియాన్ని సందర్శించి, యోగాభ్యాసకుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో యోగాభ్యాసకులు ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డి రఘునాథ్ రెడ్డి, యోగాభ్యాసకులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, మహిపాల్ రెడ్డి, పద్మ, సింహాచలం, సురేష్, శంకర్ పటేల్, వెంకటేశ్వరరావు, జ్ఞానేశ్వర్, బాల నాగరాజు, వెంకట్, మంజుల, రేవతి, రమ్య, లీలావతి, చైత్ర పాల్గొన్నారు.



ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో భారీ చోరీ

- నాలుగు రోజుల్లో నిందితుడి అరెస్ట్
- 35 తులాల బంగారం, 2 కిలోల వెండి అపహరణ..
- చోరీ సొత్తు, స్కూటర్, మొబైల్ స్వాధీనం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై డబ్బు అవసరాల కోసం భారీ చోరీకి పాల్పడిన వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు నాలుగు రోజుల్లోనే అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లోని శిల్పా వ్యాలీ సారా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ చోరీ కేసును గచ్చిబౌలి క్రైమ్ టీమ్ ఛేదించింది.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీ రాత్రి సినిమాటోగ్రాఫర్ అనుష్ కుమార్ రెడ్డి నివాసముంటున్న ఫ్లాట్ నంబర్ 502లో ఎవరూ లేని సమయంలో నిందితుడు లిమ్మక అనంత్ కుమార్ (28) చోరీకి పాల్పడ్డాడు. అపార్ట్‌మెంట్ టెర్రస్ నుంచి బాల్కనీలోకి ప్రవేశించి, ఇంటి సైడింగ్ డోర్‌తో పాటు అల్మారాను ధ్వంసం చేసి సుమారు 35 తులాల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులను అపహరించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన గచ్చిబౌలి ఎక్స్‌రోడ్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో దఫా బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడి, ఆర్థిక అవసరాల కోసం చోరీకి పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు, వెండి వస్తువులతో పాటు హోండా యాక్టివా స్కూటర్, మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి, నార్సింగి డివిజన్ ఏసీపీ, గచ్చిబౌలి ఎస్‌హెచ్ఓ పర్యవేక్షణలో డీఐ, క్రైమ్ టీమ్, పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును ఛేదించారు.



ఘనంగా గ్యారవి షరీఫ్ ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్యారల శ్రీనివాస్ గౌడ్

అబ్దుల్లాపూర్ మెట్, తెలంగాణ చౌరస్తా:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కుంట్లూర్ డివిజన్‌లో సూఫీ ఆధ్యాత్మిక గురువు హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ స్మారకార్థం పవిత్ర గ్యారవి షరీఫ్ సందల్ జెండా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో జిఎస్ సేవా సమితి చైర్మన్ పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి,దేశం రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించారు.అనంతరం ముస్లిం సోదరులను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్యారల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..భారతదేశం గొప్ప సంస్కారానికి, సంస్కృతికి నిలయమని, ముఖ్యంగా మన ప్రాంతంలో గంగాజమునా తెహజీబ్ సంస్కృతి పరిఢవిల్లుతోందని కొనియాడారు.అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో మత సామరస్యం,సోదరభావం,ఐక్యతను చాటుతూ పండుగలను జరుపుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి వేడుకలు సమాజంలో శాంతియుత వాతావరణాన్ని, మానవతా విలువలను మరింత పెంపొందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో స్థానిక మత పెద్దలు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలనే ప్రభుత్వ లక్ష్యం

- మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళిలో
- సర్పంచ్ విజయ శ్రీశైలం గౌడ్

అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:

అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసాలకు వెళ్లిన గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, లబ్ధిదారులతో కలిసి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయ మాట్లాడుతూ.. పేదలందరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గడ్డమీది దశరథ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, మాచగొని మహేందర్ ముదిరాజ్, బండి సునీత ఉపేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి తుల్జా ప్రసాద్, బిల్ కలెక్టర్ సురేందర్ పాల్,గ్రామ నాయకులు, స్థానిక మహిళలు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తొర్రూరులో ఇందిరమ్మ ఇళ్ల
లబ్ధిదారులతో దీపావళి సంబరాలు



- నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం రేవంత్ రెడ్డి
- మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్

తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచనలతో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లలో దీపాలు వెలిగించి, కాకరపువ్వొత్తులు కాల్చి, బాణాసంచా పేలుస్తూ పండుగ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని, ఈ దీపావళి వారి జీవితాల్లో మరింత వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, హౌసింగ్ ఏఈ యామిని, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి బిక్షం గౌడ్, కర్ర అశోక్ రెడ్డి, నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కాసిపేట, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు కాసిపేట మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో ఈరోజు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య,అమరవాది శ్రీలత, ఏనుగు జనార్దన్ రెడ్డి,డాక్టర్ రాజమౌళి,మైదం రమేష్, చెన్నవేని పవయ్య,ఏనుగు తిరుపతి రెడ్డి, కాటిక వరం,కుర్మ నరసయ్య,ఉడుతల రాజయ్య, ముత్యాల నవీన్ కుమార్, లబ్ధిదారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అక్రమ
అరెస్టులను వెంటనే ఆపాలి

- హామీలు అమలు చేయకుండా ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం అన్యాయం
- డాక్టర్ ఎన్. అశోక్

రామన్నపేట | తెలంగాణ చౌరస్తా :

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సభలు జరిగిన ప్రతిసారీ దివ్యాంగులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్ అన్నారు. దివ్యాంగుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులతో అణచివేయాలని చూడటం బాధాకరమన్నారు. దివ్యాంగుల పింఛన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పనతో పాటు దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడటం సరైన విధానం కాదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దివ్యాంగులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రానున్న రోజుల్లో దివ్యాంగులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని డాక్టర్ ఎన్. అశోక్ హెచ్చరించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ రైతు
వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



- 36వ అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి
- మల్లు నాగార్జున రెడ్డి
- 36 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ.. రైతులు, రైతు కూలీల సంఘీభావం

నూతనకల్, తెలంగాణ చౌరస్తా:

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నూతనకల్ మండలంలోని వెంకేపల్లి, చిల్పకుంట్ల గ్రామాల్లో 36 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలకు సంఘీభావం ప్రకటించారు.ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కోరారు.60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలని, సహకార సంఘాలను బలోపేతం చేయాలని, కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా అండగా నిలవాలని అన్నారు. తుఫానుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని, రైతులందరికీ సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్ వ్యవసాయ విధానాలను రద్దు చేసి, వ్యవసాయ రంగాన్ని రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సమస్యల పరిష్కారం,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న 36వ జాతీయ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసు సత్యం, చిల్పకుంట్ల గ్రామ సర్పంచ్ అంజంపల్లి నరసమ్మ, ఉపసర్పంచ్ సామ సురేందర్ రెడ్డి, నూతనకల్ మండల రైతు సంఘం అధ్యక్షులు చూడి మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శి గజ్జల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూడెమోక్రసీ కార్యాలయం ప్రారంభం



- అమరవీరులకు ఘన నివాళులు..
- అమరవీరుల ఆశయ సాధనకు నిరంతరం పోరాడాలి
- గంటా నాగయ్య

నూతనకల్, తెలంగాణ చౌరస్తా:

అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం పోరాటాలు కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పిలుపునిచ్చారు. అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు గ్రామగ్రామాన అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించాలన్న పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గ్రామంలోని అమరవీరుల స్తూపం వద్ద పార్టీ గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య జెండా ఆవిష్కరించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు ముప్పాని సుదర్శన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి పార్టీ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా నాగయ్య మాట్లాడుతూ..విప్లవోద్యమంలో ఎందరో త్యాగధనులు పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులయ్యారని గుర్తుచేశారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలన, సమసమాజ స్థాపన, దున్నేవారికి భూమి వంటి లక్ష్యాల సాధన కోసం భూస్వామ్య, పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాడి పోలీసుల ఎన్‌కౌంటర్లు, పెత్తందారుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.అమరవీరుల త్యాగాలు, ఆశయాలు వృథా కాకుండా వాటి సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చిల్పకుంట్లలో ప్రారంభించిన పార్టీ కార్యాలయాన్ని ప్రజా ఉద్యమాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజల్లో చైతన్యం, విజ్ఞానాన్ని పెంపొందించే వేదికగా కార్యాలయాన్ని వినియోగించుకోవాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మున్నా అశోక్, జిల్లా కమిటీ సభ్యులు జటంగి సతీష్, గడ్డం జానయ్య, కూసు ఉప్పలయ్య, చీమల సోమయ్య, సత్తయ్య, పంతం శ్రీను, కూసు వెంకన్న పాల్గొన్నారు.

టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధిగా పెర్క శ్యామ్

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర అధికార ప్రతినిధిగా పెర్క శ్యామ్ నియమితులయ్యారు.ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు.ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఆశయాలు,సిద్ధాంతాలను ప్రజలకు వివరించడంతో పాటు, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి,మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి,దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ,ప్రభుత్వ విప్ విజయ రమణ రావు,పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు,ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పెర్క శ్యామ్ స్పష్టం చేశారు.